# దాహం

## మమత & పండరినాథ్

కారు ముందుకీ, తార్రోడు వెనక్కీ పరుగెడుతున్నాయి. వొళ్ళంతా స్వేదబిందుపులతో తడిసిపోయింది. నాలుక పిడ్చకట్టుకుపోయినట్టుగా దాహంగా వుంది. ఎదురుగా డ్రైవర్ చేతులు కట్టుకొని "కింకర్తవ్యం" అన్నట్టుగా సందిద్ధంగా తారామణి మొహంలోకి చూస్తున్నాడు-

"దాహంగా వుంది-ముందు మంచినీళ్ళు కావాలి"-తారామణి ఆజ్ఞ.

డ్రయివర్ డిక్కీ తెర్చి ఖాళీ సీసాను బయటికి లాగేడు-

"సీసాలో నీళ్ళు అయిపోయాయి. అమ్మగారూ!-ఏంచేద్దాం?" అన్నట్టుగా మళ్ళీ డ్రయివర్ తారామణి మొహం వంక తన మొహాన్ని పెట్టాడు—కెమేరాకు ఎదురుగా పెట్టే రిఫ్లెక్టర్‌లా తారామణి నిట్టూర్చి, చుట్టూ పక్కలకు చూసింది—ఎక్కడైనా కొలనులాంటిది కన్పిస్తుందేమోనని—చెట్లూ, చేమలూ, కొండలు, లోయలూ తప్పించి నీళ్ళపాయలు ఏవీ కన్పించటంలేదు. ఎటొచ్చీ మళ్ళీ తార్రోడ్డే నల్లని పాములా మెరుస్తూ కన్పిస్తూంది.

"వొచ్చేటప్పుడే టాంకులో పెట్రోలు వుందో లేదో చూసొక్కని రాకూడదూ? ఇప్పుడు చూడు అడవి మధ్యలో ఆగిపోయాం"-

"తప్పయి పోయింది అమ్మగారూ! ఏదేనా వెహికల్ ఇటేపువొస్తే వాళ్ళను అడుగుతాను"-

"ఈ అడవిలో తప్పయిపోయిందని అపాలజీ ఇస్తే ఏం లాభం? ముందు మంచినీళ్ళు కాసిని ఎక్కడైనా దొరుకుతాయేమో చూడు"-

డ్రయివర్ రాజు కళ్ళు చిట్లించి, నడుం వొంచి, చుట్టూ చూడసాగేడు. దూరాన మనకమసక దీపాలు బిక్కుబిక్కు మంటూ భయంతో వొణికే మనుషుల్లా ఆకాశంలో చుక్కల్లా కన్పించాయ్-

"అక్కడేదో చిన్న వూరున్నట్టుంది-నేను వెళ్ళినీళ్ళు పట్టుకొస్తాను-మీరు వెళ్ళి కారులో కూచోండి"

"నేనొక్కదాన్నే ఇక్కడ ఎలా వుండగల్ను? పద నేనూ వస్తాను-"

కారుడోర్‌ను లాక్ చేసేసి డ్రయివర్ రాజు రోడుదిగి కాలిబాటన కదలగానే, అతన్ని అనుసరించింది ప్రఖ్యాత సినీతార మిస్ తారామణి. కీచురాళ్ళ శబ్దం, ఎండుటాకుల గలగలలు. తారామణిలో సన్నని వణుకు ప్రారంభమైంది. మెడలోని ముత్యాల హారాన్ని, చెవులకున్న జూకాల్ని చెక్ చేసుకుని-

"ఇంకెంతదూరం"-అనడిగింది చకచకా పరుగెత్తినట్టుగా నడుస్తూ.

ఇంకొద్దిదూరమే అమ్మగారూ! దీపాలు దగ్గరవుతున్నాయ్‌గా-! మిమ్మల్ని చూడగానే ఆవూరి ప్రజలు ఆశ్చర్యపోతారు"—నడుస్తున్నే శలవిచ్చాడు డ్రయివర్ రాజు-ఆమెపైగల అభిమానుల మోజును గుర్తుచేసుకుంటూ తారామణి పెదాలపై చిరునవ్వు నాట్యమాడింది.

"రాజూ! నే సినీతారననే విషయం వాళ్ళకు చెప్పకు. వాళ్ళే తెల్సుకుంటారు"-

"అలాగే! అమ్మగారూ"-

రాజు నవ్వుతూ, నడుస్తూ, నడుస్తూ, నవ్వుతూ-తలూపాడు. చెట్లక్రీనీడల్లో నడిచే తారామణిలో భయం భారీఎత్తున్న ఉన్నా, మామూలు కుగ్రామంలాంటి ఆవూర్లో తనను గుర్తిస్తే వాళ్ళ హావభావాలు, మనోభావాలు ఎలా వుంటాయ్ అనే ఉత్కంఠత ఉద్భవించింది. అనూహ్యంగా-హఠాత్తుగా దేవత ప్రత్యక్షమైనట్టుగా తను ఆవూర్లోకెళ్ళటంగొప్ప థ్రిల్లింగే! రాష్ట్రంలో కొన్నివేల అభిమాన సంఘాలు తనపై అభిమానాన్ని కురిపిస్తున్నాయ్, మురిపిస్తున్నాయ్.

వూర్లో కొచ్చేరు—రాజు, తారామణి.

ఆవూర్లో కప్పుల్లేని మట్టిగోడలే ఎక్కువగా కన్పిస్తున్నాయ్. రాత్రిపూటే-పట్టు మని పాతిక కొంపలు కూడా లేవు. డ్రయివర్ రాజు వో ఇంటి తలుపులు తట్టగానే, ఆఇంటి ఇల్లాలు గామోసు మెల్లిగా, తలుపుల్ని తెర్చి లాంతర్నిచేతిలో పట్టుకొని "ఎవరూ?" అంటూ వొచ్చింది.

తారామణిని చూడగానే ఆమె అవాక్కయి నిలబడి పోయింది. తారామణి వీరనారిలా డ్రయివర్ వంకచూసి ముసిముసిగా నవ్వసాగింది. లాంతరు పట్టుకున్న లావాటి మనిషి పెట్రోమాక్స్ లైట్లా మొహాన్ని వెలిగించేసి గొంతుకు చించి, కంఠారావాన్ని చుట్టూ ఇళ్ళకు విన్పించింది. ఫలితంగా-చుట్టూఇళ్ళ తలుపులు ఫటాఫట్ మని తెర్చుకున్నాయ్. ఆడ, మగ, చంటి పిల్లనించి పండు ముసలి వరకు గారడీ చూస్తున్నట్టుగా తారామణి చుట్టూరా మూగారు. ఆమసక చీకట్లో తారామణి మొహం మబ్బు తొలగిన పున్నమి జాబిల్లిలా మారింది. ఆమెలో గూడు కట్టుకున్న భయం, దాహం చెరోదారికి పరుగుతీసాయ్.

"అరెరె! నిలబడి వున్నారే! కూచోండీ"

"కుర్చీల్లేకపోతే ఎలా కూర్చోటం"-ట్యూన్ పెంచని రేడియోలా మనస్సులో మాట్లాడుకొని అస్థిమితంగా కదిలి వోరగా వెనక్కిచూసింది.

రెండుకుర్చీలు వెనక వున్నాయ్-మీ భారాన్ని మేం మోయగలం అంటున్నట్టుగా-ఎప్పుడువేసారో ఏమో? తారామణి చిరునవ్వుతో, కూచుండి పోయింది. రాజు నిలబడి పోయేడు.

"కాఫీ తాగుతారా?"

"ముందు మంచినీళ్ళు కావాలి! చాలా దప్పిగ్గావుంది."

ఒకావిడ వడివడిగా మంచినీళ్ళుతేవటాని కెళ్ళింది. ఇక వీళ్ళంతా షూటింగ్ విషయాలు అడగటం మొదలెట్టారేమో? చుట్టూ మూగిన జనాలందర్నీ చూస్తోంది తారామణి. దరహాసంతో.

"రానమ్మత్త ఎలావుంది"-

"రానమ్మత్త? ఆమె ఎవరు?" తారామణి ప్రశ్నార్థకంగా మొహంపెట్టి అడిగింది.

"మీ అత్తమ్మత్త. మర్చిపోయేవా?"-సమూహం నించి ఓ ఆవిడ మాట.

"రానమ్మత్త-ఎవతో నాకు తెలీదు-"

డ్రయివర్ రాజు వంక బెరుకుగా, ప్రశ్నార్థకంగా చూసింది తారామణి.

"అయితే నీవు పట్నం పంతులు జోగులుతో లేచిపోయిన రుక్కమ్మత్త కూతురు మంగమ్మత్తవు కదూ ?"

ఇక రాజు అందుకున్నాడు-

"ఎవర్నిచూసో ఎవరో అనుకున్నారు- ఈమెసుప్రసిద్ధ సినీనటితారామణి. మద్రాస్ వెళుతుంటే మధ్య మార్గంలో పెట్రోలు అయిపోయి కారు ఆగిపోయింది. రోడుకు దగ్గర్లో మీవూరు కన్పిస్తే మంచినీళ్ళు త్రాగటానికి ఇక్కడికి వచ్చేం"

"అలాగా!"-

చుట్టూ మూగిన వాళ్ళ కళ్ళలోకి తమ అంచనా తారు మారైనందుకు నిరుత్సాహం పాకింది.

"మీరెప్పుడైనా మద్రాసొస్తే నాదగ్గరకు రండి. మీకు షూటింగ్ చూసే అవకాశం కల్పిస్తాను" హామీ ఇస్తున్నట్టుగా చేతులు తిప్పుతూ చెప్పింది తారామణి వాళ్ళలో ఆసక్తిని చూడాలని. ఆమె తాపత్రయం. అంతేకాదు, తనేంటో, తన నట నేంటో చూపాలనే సంకల్పం.

"షూటింగ్ అంటే" ? ఎవరో పెద్దావిడ ప్రశ్నించింది అమాయికంగా.

"సినిమా తీసే విధానం"-రాజు సమాధానం గైడ్‌లా.

"సినిమా అంటే" ? 20 కి॥మి॥ దరిదాపుల్లో టూరింగుటాకీ సైనాలేని జనం ఏక కంఠంతో నినాదం పలికినట్టుగా అడిగారు. తారామణి రక్కునలేచి నించుంది.

"మంచినీళ్ళు తాగండి"-రాజు అడిగాడు.

"నాకు దాహంగా లేదు పదరాజు" ■